# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ న్యాయ స్థానాల్లో కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.
- ❖ తెలుగు భాష తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు.
- ❖ వేట్లపాలెం బాణాసంచా దుర్ఘటన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు.
- ❖ ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా అమలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

=====================

న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కోరారు. తిరుపతిలో కోర్టు భవనాల సముదాయానికి ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోర్టుకు వచ్చామంటే తమకు కచ్చితంగా న్యాయం జరుగుతుందనే నమ్మకం రావాలని అన్నారు. న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే.. సరైన న్యాయం జరుగుతుందని చెప్పారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. అలాగే న్యాయవ్యవస్థ మరింత బలోపేతమవుతోందని అన్నారు. నూతనంగా వచ్చే న్యాయవాదులు మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

అమరావతి సమీపంలోని పిచ్చుకలపాలెం వద్ద జుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ జుడీషియల్ అకాడమీని 165 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నారు. అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ భవన నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. 69 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 50 వేల చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంలో ఈ భవన నిర్మాణం జరగనుంది. అదే విధంగా అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలను జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

=====================

సుదీర్ఘ చరిత్రతో పాటు మహోన్నతమైన సాహిత్య సంపద కలిగిన తెలుగు భాష తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరుగుతున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలలో రెండవ రోజు అయిన ఈ రోజు గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాచీన కాలం నుండి ఈరోజు వరకు తెలుగు భాష ప్రాచుర్యానికి ఎంతో మంది కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న  తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ... తెలుగు జాతికి చెందిన భారతరత్న పి.వి.నరసింహారావు వంటి ఎందరో మహానుభావులు ఉన్నారన్నారు.

=====================

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉందని చెప్పారు. తిరుపతిలో మంత్రి మనోహర్ పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ... రైతులు కష్టపడి పండించిన ప్రతి గింజకు కనీస మద్దతు ధర ప్రకారం సరైన విలువ చెల్లించే విధంగా కొనుగోలు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం శుద్ధి చేసి, రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ హాస్టళ్లు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఇతర ప్రత్యేక విద్యా సంస్థలలో వినియోగిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

విరామం

=====================

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనకు సంబంధించిన క్షతగాత్రులను ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈ రోజు పరామర్శించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను ఆయన జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో క్షతగాత్రులకు అందుతున్న వైద్య సదుపాయాలకు సంబంధించిన వివరాలపై వైద్యులతో మాట్లాడారు. వారికి  మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

=====================

వేట్లపాలెం బాణాసంచా దుర్ఘటన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన ఈ రోజు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రమాదంలో మరణించిన వారి ఒక్కో కుటుంబానికి 20 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రమాదానికి గల కారణాలను విచారిస్తామని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

======================

అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళనలు విరమించి ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మంత్రి ఈరోజు మాట్లాడుతూ... అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. అంగన్వాడీ సిబ్బంది పెట్టిన 10 డిమాండ్లలో తొమ్మిదింటిని ప్రభుత్వం ఇప్పటికే పరిష్కరించిందని మంత్రి గుర్తు చేశారు.

======================

ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ సూపర్-8లో చివరి క్రికెట్ మ్యాచ్ లో వెస్టిండీస్‌తో భారత్ తలపడనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభంకానుంది. అదే విధంగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే జట్ల మధ్య ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన జింబాబ్వే.. దక్షిణాఫ్రికాకు 154 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 14 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 126 పరులుగు చేసింది.

======================

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జి. సాయి ప్రసాద్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ముఖ్యమంత్రికి ఎక్స్ ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన కె. విజయానంద్ కూడా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.

======================

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు మద్దతు ధర అందించడమే కాకుండా బహిరంగ మార్కెట్ లో కంటే ఎక్కువ ధర దక్కేలా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. అలాగే.. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

======================

======================